నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | గురువారం 29 మే 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD





గొల్లపల్లిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

# కాంగ్రెస్ రైతులను నట్టేట ముంచింది

## వర్షానికి ధాన్యం తడుస్తున్నా కనికరించే నాథుడు లేడు

- ఇక్కడి ఎమ్మెల్యేకు మంత్రి పదవిపై ఉన్న ప్రేమ కర్షకులపై లేదు
- రెండు రోజుల్లో ధాన్యం మొత్తం కొని మిల్లులకు తరలించకుంటే ఆందోళనలు చేస్తాం
- బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- గొల్లపల్లి, మైలారంలో తడిసిన వడ్లు పరిశీలన

నెన్నెల, మే 28 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట్ట ముంచిందని, కొనేవారు లేక ధాన్యం కల్లాలు దాటడం లేదని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నెన్నెల మండలం గొల్లపల్లి, మైలారం గ్రామాల్లో వర్షాలతో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఇబ్బందులను ఏనాడూ పట్టించుకోలేదని, ధాన్యం అమ్ముకునేందుకు పడరాని పాట్లు పడుతున్నా కనికరించడం లేదని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో లేక కిలోమీటర్ల దూరం ధాన్యాన్ని తీసుకురావాల్సి వస్తుందని, కొనుగోలు కేంద్రాల్లో నెలల తరబడి ధాన్యం కొనేవారు లేక రైతులు అవస్థలు పడుతున్నారని, వర్షాలకు వడ్లు తడిసి తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గొల్లపల్లిలో రెండు వందలకు పైగా ఎకరాల్లో పంట సాగు చేస్తే కేంద్రం ఏర్పాటు చేయలేదన్నారు. గతంలో ఇక్కడ కేంద్రం ఏర్పాటు చేసి మొత్తం ధాన్యాన్ని తీసుకున్నట్లు గుర్తు చేశారు. 50 ఎకరాలున్న గ్రామాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసిన అధికారులు ఇక్కడ ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. అధికార పార్టీకి చెందిన వారి వడ్లే కొంటూ.. ఇతర పార్టీలకు చెందిన వారివి తీసుకుంటలేరని, ఈ విషయాన్ని రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. అకాల వర్షాల వల్ల ఒక్క గొల్లపల్లిలోనే 50 ఎకరాల పంట నూర్పిడి చేయలేక వదిలేశారని, దీని వల్ల రైతులు లక్షల్లో నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్లంపల్లి ఎమ్మెల్యేకు మంత్రి పదవి మీద ఉన్న ప్రేమ.. రైతుల మీద లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వడ్లు తడిసి రైతులు నష్టపోతుంటే ఒక్క రోజైనా వచ్చి చూశారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలోతొక్కిందని, ఇప్పటికీ మూడుసార్లు రైతుబంధు డబ్బులు వేయలేదని, పంట రుణ మాఫీ కాలేదని అన్నారు. రెండు రోజుల్లో ప్రతి గింజనూ కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని, లేదంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంజాల సాగర్‌గౌడ్, నాయకులు రాంచందర్, ప్రతాప్‌రెడ్డి, మేకల మల్లేశ్, రమేశ్, ఇబ్రహీం, మాజీ సర్పంచ్‌లు శంకర్, శివప్రసాద్, రమేశ్, అశోక్‌గౌడ్, శ్రీనివాస్, మోహన్, తిరుపతి ఉన్నారు.





# హస్తంలో వ్యతిరేకరాగం

## తూర్పు జిల్లా కాంగ్రెస్‌లో వేడెక్కుతున్న రాజకీయం

మంచిర్యాల, మే 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తూర్పు జిల్లాగా పేరున్న మంచిర్యాల–ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. గత ఎన్నికల్లో ఓటమి పాలై అధికార పార్టీలో చేరిన కొందరు నాయకులకు అందులో తగిన ప్రాధాన్యం లభించడం లేదంటూ అలకబూనడం కనిపిస్తున్నది. తమ కంటే జూనియర్లకు ప్రాధాన్యమిస్తూ తమను పట్టించుకోవడం లేదన్న అసమ్మతి పలువురి నేతల్లో తారాస్థాయికి చేరింది. అధికార పార్టీ తమపట్ల వ్యవహరిస్తున్న తీరుపై, స్థానిక నాయకులపై సొంత పార్టీ నాయకులు బహిరంగంగానే విమర్శలు గుప్పించడం నిత్యకృత్యమవుతున్నది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు ఇలా అధికార పార్టీలో కీలకం అనుకుంటున్న నాయకులే వ్యతిరేకరాగం ఎత్తుకోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. తూర్పు జిల్లాలో కాగజ్‌నగర్, చెన్నూర్ నియోజకవర్గాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వరం పెంచడంతో రెండు జిల్లాల్లో హస్తం పార్టీకి ఇబ్బందులు తప్పవనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

### పార్టీ మారుతానన్న కోనప్ప

సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. అప్పటి నుంచి పార్టీలో తనకు ప్రాధాన్యం దక్కలేదని ఆయన అసమ్మతితో ఉంటూ వచ్చారు. కాగజ్‌నగర్ కాంగ్రెస్ లీడర్ రావి శ్రీనివాస్, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మరో నాయకుడు దండే విఠల్.. ఎవరికి వారు నియోజకవర్గంపై పట్టుబిగించే ప్రయత్నాలు చేశారు. దీంతో అధికార పార్టీ మూడు వర్గాలుగా చీలిపోయే పరిస్థితి నెలకొంది. సీనియరైన తనని పట్టించుకోకుండా ఇతరులకు ప్రాధాన్యమివ్వడం కోనప్పకు నచ్చలేదని తెలిసింది. అధికార పార్టీ వ్యవహార శైలిపై ఆయన గతంలోనూ మండిపడ్డారు. మొన్నటికిమొన్న కాంగ్రెస్ పార్టీతో నియోజకవర్గానికి ఒరిగింది ఏం లేదని, ఇచ్చిన హామీని కూడా నెరవేర్చడం లేదంటూ ఘాటు విమర్శలు చేశారు. త్వరలోనే వేరే పార్టీలో చేరుతానంటూ ప్రకటించారు. బీఆర్ఎస్ హయాంలోనే నియోజకవర్గ అభివృద్ధి జరిగిందన్న ఆయన, కేసీఆర్ కుటుంబంతో తనకు ఎలాంటి విబేధాలు లేవన్నారు. ఈ వ్యాఖ్యలు స్థానికంగా రాజకీయ దుమారం రేపాయి. మరోవైపు చెన్నూర్‌లో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి ఏకంగా ఎమ్మెల్యే వివేక్‌పైనే విమర్శలు గుప్పించారు. పార్టీ సంస్థగత ఎన్నికల పరిశీలకుల ముందే ఎమ్మెల్యే బీజేపీలోకి పోతున్నడా, బీఆర్ఎస్‌లోకి పోతున్నడా అనుమానాలు ఉన్నాయంటూ కుండబద్ధలు కొట్టారు. దీంతో చెన్నూర్ కాంగ్రెస్ లీడర్లు ఎమ్మెల్యే అనుకూల వర్గం, మూల రాజిరెడ్డి వర్గం అంటూ రెండుగా చీలిపోయారు. ఇప్పటికీ ఒక వర్గంపై మరొకరు విమర్శలు చేసుకోవడం నిత్యకృత్యంగా మారింది.

### కీలక సమయంలో తిరుగుబాటు..

జూన్ లేదా జూలైలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయనే ప్రచారం జరుగుతుంది. ఈ సమయంలో అటు సిర్పూర్ కాగజ్‌నగర్, ఇటు చెన్నూర్‌లో అధికార పార్టీకి కీలకం అని భావించిన ముఖ్య నేతలు పార్టీపై, ఎమ్మెల్యేపై తిరుగుబాటుకు దిగడం స్థానిక రాజకీయాల్లో భారీ కుదుపు తీసుకువచ్చింది. కోనప్ప లేకుండా కాగజ్‌నగర్ నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కనీస పోటీ ఇవ్వగలదా అన్నది సందేహంగా మారింది. కాస్తో కూస్తో ఆ పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పార్టీ మారుతానంటూ ప్రకటన చేయడం ఆ పార్టీని నైరాశ్యంలోకి నెట్టింది. క్షేత్రస్థాయిలో ఆయన అనుచరులు సైతం ఒక్కసారిగా సైలెంట్ అయిపోయారు. ఇక చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంతో పాటు కోటపల్లి మండలాన్ని ప్రభావితం చేయగల నేత రాజిరెడ్డి తిరుగుబాటు అధికార పార్టీకి మైనస్‌గా మారనున్నది. లోకల్‌బాడీ ఎన్నికల్లో ఆ ప్రభావం కచ్చితంగా కనిపిస్తుందని లోకల్ కాంగ్రెస్ లీడర్లే చెబుతున్నారు. ఈ ప్రభావం జిల్లాలోని ఇతర నియోజకవర్గాలపైనా పడే ఛాన్స్ ఉందంటున్నారు. మొన్నటికి మొన్న మంచిర్యాలలో గడ్డం ఫ్యామిలీ వర్గం వర్సెస్ పీఎస్ఆర్ వర్గం బాహాబాహీకి దిగారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పార్టీ రెండుగా చీలిపోయిందని చెబుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇబ్బందులు తప్పవని సొంత పార్టీ లీడర్లే వాపోతున్నారు.

### బీఆర్ఎస్ వైపు అడుగులు..

ఎన్నికలకు ముందు అధికార పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యేలు పలువురు బీఆర్ఎస్‌లో చేరేందుకు సుముఖంగా ఉన్నారనే ప్రచారం ఇప్పుడు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కోనప్ప వ్యాఖ్యల వెనక ఆంతర్యం సైతం ఇదేనంటూ పలువురు చర్చించుకుంటున్నారు. అదే జరిగితే ఆయనతో పాటు కాంగ్రెస్‌లో చేరిన నిర్మల్ జిల్లాకు చెందిన కీలక నాయకులు సైతం కారు ఎక్కుతారనే ఊహాగాహానాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీపై తీవ్రమైన వ్యతిరేకత కనిపిస్తుండటం.. గత ప్రభుత్వం చేసిన పనులతో జనాలు పోల్చి చూసుకుంటుండంతో బీఆర్ఎస్‌లో ఉంటేనే తమకు గౌరవం ఉంటుందనే అభిప్రాయానికి కొందరు నేతలు వచ్చినట్లు తెలిసింది. ఆసిఫాబాద్, నిర్మల్‌తో పాటు చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్‌కు వ్యతిరేకవర్గాలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నట్లు సమాచారం. అదే జరిగితే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే హస్తం పార్టీని కీలక నాయకులు వీడే అవకాశాలు ఉన్నాయి. అది ఆ పార్టీకి ఇబ్బంది కలిగించవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరి ఈ వ్యవహారంపై హస్తం పార్టీ అధినాయకత్వం ఎలా స్పందిస్తుందన్నది వేచి చూడాల్సి ఉంది.



దేవాపూర్ ఓరియంట్(అదానీ) సిమెంట్ కంపెనీ

# 'ఓరియంట్' గుర్తింపు సంఘం ఎన్నికలపై కసరత్తు

- హైకోర్టు ఆదేశాలతో జూన్ 5న సమావేశం
- గుర్తుల కేటాయింపు, ఎన్నికల తేదీపై చర్చ

కాసిపేట, మే 28 : కాసిపేట మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్(అదానీ) కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికలపై కసరత్తు మొదలైంది. హైకోర్టు ఆదేశాలతో జూన్ 5న ఓరియంట్ సిమెంట్ యూనియన్లతో సమావేశానికి డిప్యూటీ లేబర్ కమిషనర్ ఉత్వర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్‌లో డిప్యూటీ లేబర్ కమిషనర్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో మెజార్టీ యూనియన్ల నిర్ణయం మేరకు ఎన్నికల తేదీతో పాటు ఎన్నికల విధానాన్ని ప్రకటించే అవకాశమున్నది. దీంతో పాటు సమావేశంలో గుర్తుల కేటాయింపు చేయనున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. కొన్ని నెలల క్రితమే ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, ఓరియంట్ సిమెంట్ కంపెనీని అదానీ గ్రూపులు కొనుగోలు చేసింది. యాజమాన్యం మార్పు ప్రక్రియ కొనసాగుతుండగా ఎన్నికలు వాయిదా వేశారు. ప్రస్తుతం యాజమాన్యం మార్పు ప్రక్రియ పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలతో కార్మిక శాఖ ఎన్నికల కసరత్తు ప్రారంభించింది.



కోనప్ప ఇంటి వద్ద నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

# హరీశ్‌బాబు X కోనప్ప

## ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుపై బహిరంగ చర్చకు సవాళ్లు విసురుకున్న ఎమ్మెల్యే-మాజీ ఎమ్మెల్యే

- ఇద్దరిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు
- కాగజ్‌నగర్‌లో ఉద్రిక్త పరిస్థితులు
- సిర్పూర్‌లో వేడెక్కుతున్న రాజకీయాలు



మీడియాతో మాట్లాడుతున్న కోనేరు కోనప్ప



పోలీసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎవరూ అడ్డుకున్నారనే విషయంపై ఎమ్మెల్యే హరీశ్‌బాబు–మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బహిరంగ చర్చకు సవాళ్లు విసురుకోవడం సిర్పూర్ నియోజకవర్గంలో హైటెన్షన్ పుట్టించింది. నాలుగు రోజుల క్రితం చింతలమానేపల్లి మండలం డబ్బా గ్రామంలో కోనేరు కోనప్ప నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ప్రాణహిత–చేవేళ్ల ప్రాజెక్టును అడ్డుకున్నది మాజీ ఎమ్మెల్యే రాజ్యలక్ష్మి అని ఆయన చెప్పడం వివాదాస్పదమైంది. దీనిపై స్పందించిన ప్రస్తుత ఎమ్మెల్యే హరీశ్‌బాబు ప్రాణహితను అడ్డుకున్నది ఎవరనేదానిపై తుమ్మిడిహెట్టి వద్ద బహిరంగ చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు సవాలు విసిరారు. ఈ సవాలును స్వీకరించిన కోనేరు కోనప్ప బహిరంగ చర్చకు సిద్ధమంటూ ప్రతి సవాలు విసిరారు. దీంతో బుధవారం ఉదయం 11 గంటలకు తుమ్మిడిహెట్టికి వెళ్లేందుకు ఇద్దరూ సిద్ధం కాగా, పోలీసులు అడ్డుకున్నారు. ఇద్దరినీ హౌస్ అరెస్ట్ చేశారు. ఏఎస్పీ చిత్తరంజన్, డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో సుమారు 150 మంది పోలీసులు ఆయా నేతల ఇళ్ల వద్ద, కాగజ్‌నగర్ పట్టణంలో భద్రతా చర్యలు చేపట్టారు. ఇరు వర్గాలు సోషల్ మీడియాలో పోస్టులు జోరుగా పెట్టడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ తల్లి.. మాజీ ఎమ్మెల్యే రాజ్యలక్ష్మి ప్రాణహిత–చేవెళ్ల నిర్మాణానికి వ్యతిరేకంగా ధర్నా చేశారని, వీటికి సంబంధించిన వీడియోలు తన వద్ద ఉన్నాయన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత–చేవెళ్ల నిర్మించరాదని సీడబ్ల్యూసీ ఇచ్చిన నివేదిక ప్రకారమే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ప్రాజెక్టును కాళేశ్వరానికి తరలించారన్నారు. కౌటాల మండలం గుండాయిపేట్ వద్ద బ్యారేజ్ నిర్మించేందుకు అప్పటి సీఎం కేసీఆర్ నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈ బ్యారేజ్ నిర్మాణంతో ఈ ప్రాంతంలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని, కాంగ్రెస్ ఇప్పుడు దీనిని కూడా అడ్డుకుందని మండిపడ్డారు. ఎమ్మెల్యే హరీశ్‌బాబు మాట్లాడుతూ ప్రాణహిత–చేవెళ్లపై బహిరంగ చర్చకు తాను ఒక్కడినే బయలు దేరితో.. కోనేరు కోనప్ప మాత్రం జనాలను పోగు చేసి శాంతిభద్రతల సమస్య తలెత్తేలా ప్రయత్నించారన్నారు. దీనిని శాంతి భద్రతల సమస్యగా మార్చేందుకు ప్రయత్నించి పోలీసులను అడ్డం పెట్టుకొని చర్చకు రాకుండా మొఖం చాటేశారన్నారు.

# 'వన మహోత్సవం'ను పండుగలా నిర్వహించాలి

## కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, మే 28 : వనమహోత్సవం–2025 కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, డేవిడ్, జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్ రావు, ఏఎస్పీ చిత్తరంజన్‌తో కలిసి వన మహోత్సవం కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 100 శాతం మొక్కలు నాటి లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

### వన్యప్రాణుల సంరక్షణకు కృషి చేద్దాం

జిల్లాలోని వన్యప్రాణుల సంరక్షణకు సమష్టిగా కృషి చేద్దామని కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అడవులతో పాటు వన్యప్రాణులను రక్షించడం మన ందరి బాధ్యత అన్నారు. జిల్లా భూభాగంలో 56 శాతం అడవి ఉందని, అటవీ ప్రాంతంలో భూమి ఆక్రమణ జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారి శేషరావు, సింగరేణి సంస్థ గోలేటి జనరల్ మేనేజర్ విజయ్ భాస్కర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, ఎఫ్ఆర్వోలు పాల్గొన్నారు.

# సకాలంలో వంతెనలు పూర్తి చేయాలి

## మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్

నెన్నెల, మే 28 : సకాలంలో వంతెనలు పూర్తి చేసి రాకపోకలు సాగేలా చూడాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం నెన్నెల సమీపంలోని లంబాడీతండా ఎర్రవాగును ఆయన పరిశీలించారు. మంగళవారం కురిసిన భారీ వర్షం వల్ల తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఆరు గ్రామాలకు రావాణా సౌకర్యం లేకుండా పోయింది. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ లంబాడీతండా ఎర్రవాగు, జంగాల్‌పేట మత్తడివాగు వంతెన పనులను పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభమవుతున్నందున పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం జోగాపూర్‌లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్డీవో హరికృష్ణ, డీటీ ప్రకాశ్, ఆర్ఐ సూలోచన, ఏపీఎం విజయలక్ష్మి, ఏపీవో నరేశ్ ఉన్నారు.

### ముందస్తు చర్యలు చేపట్టాలి

నస్పూర్, మే 28 : భారీ వర్షాలకు చెరువులు నిండి తెగిపోయే అవకాశమున్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని కలెక్టర్‌లో నీటిపారుదలశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలకు చెరువలు నిండి గండి పడే ప్రమాదమున్నందున అధికారులు ఎప్పటికప్పుడు నీటి మట్టాన్ని పర్యవేక్షిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. చెరువుల కారణంగా పంట నష్టం, రహదారులు తెగిపోవడం వంటివి జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలోని నీల్వాయి ప్రాజెక్టు, కరకట్టల నిర్మాణాల పురోగతి వివరాలను తెలుసుకుని అధికారులకు పలు సూచనలు చేశారు. నీటిపారుదల ఎస్ఈ విష్ణు ప్రసాద్, డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.



లంబాడీతండా ఎర్రవాగును పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

# కౌటాలలో అడ్డుకున్న పోలీసులు



కౌటాలలో కోనేరు కృష్ణారావును అడ్డుకుంటున్న సీఐ రమేశ్

కౌటాల, మే 28 : ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎవరూ అడ్డుకున్నారనే విషయంపై ఎమ్మెల్యే హరీశ్‌బాబు–మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బహిరంగ చర్చకు సవాళ్లు విసురుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. కోనేరు కోనప్ప సోదరుడు, జడ్పీ మాజీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొమురం మాంతయ్య తదితరులు కార్యకర్తలతో కలిసి తుమ్మిడిహట్టి ప్రాణహిత నది వద్దకు వెళ్లేందుకు రాగా, కౌటాల బస్టాండ్ ఏరియాలో సీఐ ముత్యం రమేశ్ అడ్డుకున్నారు. శాంతి భద్రతలు కాపాడేందుకు సహకరించాలని కోరుతూ ఇటు బీజేపీ కార్యకర్తలు, అటు కోనేరు కోనప్ప కార్యకర్తలను పోలీసులు వెనక్కి పంపించి వేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సీఐ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్న ప్రమీల

# కూలిన ఇల్లు.. తప్పిన ప్రమాదం

మందమర్రిరూరల్, మే 28 : చిర్రకుంటలోని దుర్గం ప్రమీలకు చెందిన గూన పెంకుల ఇల్లు మంగళవారం రాత్రి కూలింది. ఇంట్లో ఉన్న వారు సురక్షితంగా బయటపడ్డారు. కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు గోడలు నాని ఇల్లు కూలి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. కూలీ పనులు చేసుకుంటూ తన ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నానని, తనకు ఇల్లు కట్టుకునే స్తోమత లేదని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని ప్రమీల వేడుకున్నది. ఘటనా స్థలాన్ని ఎంపీడీవో రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి రమేశ్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా కృషి చేస్తానని తెలిపారు.

# అభివృద్ధి నిధులు, ఇంక్రిమెంట్ రాలేదని..!

## గుండెపోటుతో జన్నారం కార్యదర్శి మృతి



రాజమౌళి(ఫైల్)

జన్నారం, మే 28 : మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ఇందన్‌పెల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజమౌళి(58) గుండెపోటుతో బుధవారం ఉదయం మృతి చెందారు. రెండేళ్లుగా ఇందన్‌పెల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. పది రోజుల పాటు కాళేశ్వరంలో పుష్కరాల విధులు ముగించుకొని వచ్చారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం ఖర్చు చేసిన నిధులతో పాటు ఇంక్రిమెంట్ డబ్బులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడేవారని, అందులో భాగంగానే గుండెపోటుతో మృతి చెందారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈయనకు భార్య పద్మ,కొడుకు ఉదయ్, కూతురు మేఘన ఉన్నారు. పంచాయతీ కార్యదర్శి చంద్రమౌళి మృతిపై ఎంపీడీవో ఉమర్ షరీఫ్, కార్యదర్శులు సంతాపం వ్యక్తం చేశారు.